# మీరు చదివారా?

## - కృష్ణవేణి





(నెలనెలా ఓ పుస్తకం - సమగ్రపరిచయం)

### *Not to Disturb*



డేమ్ మ్యూరియల్ సారా స్పార్క్ (ఫెబ్రవరీ 1918 – ఏప్రిల్ 2006) స్కాటిష్ రచయిత్రి. ఎడిన్ బర్గ్‌లో జన్మించారు. స్కాట్లాండ్లో చదువుకున్నారు. 1947లో 'పోయెట్రీ రెవ్యూ' పత్రికకు ఎడిటర్‌గా పని చేయడం ప్రారంభించినప్పుడు, ఆ కాలపు మొట్టమొదటి స్త్రీ ఎడిటర్ ఆమె.
స్పార్క్స్ తన జీవితకాలంలో ఎనిమిది గౌరవార్థక డాక్టరేట్లు పొందారు. ఆమె– నవలలూ, కవిత్వం, పిల్లల పుస్తకాలు, రేడియో నాటకాలు, బయోగ్రఫీలూ రాశారు. స్పార్క్స్ మొట్టమొదటి నవల 'ది కంఫర్టర్స్' 1957లో అచ్చయింది. 2008లో '1945 నుంచీ వచ్చిన అతి గొప్ప బ్రిటిష్ రైటర్స్'లో ఎనిమిదవవారిగా లెక్కించబడ్డారు. స్పార్క్స్ రాసిన 'లాస్ట్ మాన్' నవలకు ఆమె మరణానంతరం షార్ట్‌లిస్టుకి ఎంపిక కాబడ్డారు. స్పార్క్స్ 98 పేజీల 'నాట్ టు బి డిస్టర్బ్డ్' నవలిక 1971లో అచ్చయింది. ప్రచురణ కర్త పెంగ్విన్ బుక్స్ లిమిటెడ్. న్యూ డైరెక్షన్స్ 2010 లో పున:ముద్రించింది.

★★★




జినీవాలో క్లోప్‌స్టాక్ బ్యారన్, బ్యారొనెస్ తమ కోట లైబ్రరీలో– యువకుడైన తమ సెక్రెటరీ పసీయా (మిస్టర్ ఫెయిర్ లాక్స్) తో పాటున్నప్పుడు, ముగ్గురి మధ్యా వాదన సాగుతుంటుంది. బ్యారొనెస్ పసీయాతో ప్రేమలో పడి ఉంటుంది. పసీయా బ్యారన్‌తో.
మార్మికుడూ, కుటిలుడూ అయిన బట్లర్ లిస్టర్‌తో తమనెవరూ డిస్టర్బ్ చేయవద్దని బ్యారన్ చెప్పి 'నాట్ టు డిస్టర్బ్' అనే బోర్డ్ తలుపు బయట వేళ్ళాడదీసి, గదికి గొళ్ళెం పెడతాడు. బ్యారన్ మిగతా ఇద్దరినీ తుపాకీతో కాల్చిన తరువాత తన్ని తాను కాల్చుకుంటాడనీ, ఆ ముగ్గురిలో ఎవరూ బతికి బయటపడరనీ లిస్టర్‌కు అర్థం అయి– మేడ కింద, వెనుకవైపుండే మిగతా నౌకర్లకు సంగతి చెప్తాడు. వారందరూ ఇంటి పనుల్లో నిపుణులే. అనివార్యం అయిన ఆ మూడు మరణాలకోసం ఎదురు చూస్తుంటారు. 'యీ శాస్వతమైన త్రిభుజ వృత్తం, చుట్టూ తిరిగి వచ్చింది.' అని ఒక సేవకుడు అంటాడు. బ్యారన్ సహోదరుడు మతిలేనివాడు. అతను అటకమిద్దె మీద ఉంటాడు.

తమ సాయంత్రాన్నీ, తమ భవిష్యత్తునీ యోచించి పెట్టుకుంటారు సేవకులు. బ్యారొనెస్ నగ్నంగా ఉన్నప్పుడు, ముగ్గురూ 'లైంగిక క్రీడల్లో లీనమై ఉన్న అసంఖ్యాకమైన సయ్యాటల' గురించి మాట్లాడుకునే మేడ కింద నివాసులూ ఆ చర్యలకు అతీతం కారు. కాకపోతే, వారు తమ కార్యకలాపాల పట్ల తగుమాత్రం జాగ్రత్తలు మట్టుకు తీసుకుంటారు. వారు యజమానుల అశ్లీల వివరాల గురించిన తమ, తమ మాటలను– వేర్వేరుగా పెస్ రిలీసులకూ, రేడియో/టివి ఇంటర్వ్యూలకూ ఇచ్చేటందుకు సిద్ధపడి, ఆ ఇంటర్వ్యూలకి ప్రతిఫలంగా స్విస్ బ్యాంకుల్లో జమా అయే డబ్బు కోసం కాంట్రాక్టులు మీద సంతకాలు చేస్తారు. దుర్ఘటన జరిగేది తెల్లారురూఝామున మూడునుండి ఆరు వరకని అంచనా వేస్తారు కనుక పోలీసులూ, కెమెరాలూ రావడానికి మర్నాటి వరకూ సమయం ఉంటుందని తెలుసు.

'పొద్దున్న ఎనిమిదింటికి మనం పోలీసులని పిలిచి, జర్నలిస్టులకి ఇంటర్వ్యూ ఇద్దాం. మనం యజమానుల లైంగిక సంబంధాల గురించి మనం మాట్లాడకూడదు. అది వారి చేష్టలను అవమానపరచడమే. వారి వృత్తాల్లో అది హెచ్చు మోతాదులోనే ఉంటుంది. వారు దాని కోసమే చనిపోతారు. బహుసా ఇప్పటికే చనిపోయుండి ఉంటారు.' అని లిస్టర్ వారిని హెచ్చరిస్తాడు.' హత్యానేరం పూర్తయిందని నిర్ధారించుకోడానికి సేవకులు వేచి చూస్తున్నప్పుడు, వారి నిజ స్వరూపాలు బయటపడ్డం మొదలువుతుంది.

'నిద్ర వస్తోంది. ఒక కునుకు తీసి లేస్తాను.' అన్న పనమ్మాయితో, 'వద్దు. పోలీసులు వచ్చేటప్పటికల్లా మనం దుఖం, ఆశ్చర్యంలో మునిగి ఉన్నట్టుగా కనిపించాలి. నిద్రలేమి మొహాలపై అటువంటి ప్రభావాన్నే కనపరుస్తుందని లిస్టర్ చెప్పాడు.' అంటూ, పాబ్లో అనే మరో నౌకరు మందలిస్తాడు.

గర్భిణీగా ఉన్న వంటమ్మాయి ఇలీయాస్‌కు ఇంచుమించు నౌకర్లందరితో లైంగిక సంబంధం ఉండటంతో, పుట్టబోయే బిడ్డకి తండ్రెవరో కూడా ఆమెకే తెలియదు. బ్యారన్ సహోదరునితో ఆమె పెళ్ళి జరిపించేస్తే అతనికి సంక్రమించే ఆస్థిమీద తామే రాజ్యం ఏలవచ్చని అభిప్రాయపడిన మిగతావారు, యీ లోపల కోటకు వచ్చిన పాస్టర్‌ను పట్టుకుని ఆమెకు ఆ పిచ్చివాడితో పెళ్ళి జరిపిస్తారు. మతిస్థిమితం లేని అతను అప్పటికప్పుడే తమ వివాహం అసంపూర్ణం గావించమని పట్టుపడతాడు. పుస్తకపు అధిక భాగంలో బ్యారన్, బ్యారనెస్, సెక్రెటరీ బతికే ఉన్నప్పటికీ, పనివారు వారి గురించి ముందే భూతకాలంలో మాట్లాడ్డం మొదలెడతారు. ఆ ముగ్గురూ మరణించే తీరుతారన్న నమ్మకం వారిలో అంత లోతుగా పాతుకుపోతుంది. భీకరమైన ఉరుములూ, మెరుపులూ, గాలివాన మధ్య– కిటికీ రెక్కలూ, తలుపులూ కొట్టుకోవడంవల్ల తాము తుపాకీ గుళ్ళ శబ్దం వినలేకపోయామని మర్నాడు పోలీసులు వచ్చినప్పుడు చెప్దామన్న సమిష్టి నిర్ణయానికి చేరతారందరూ.

మరుసటి రోజు ప్రెస్ వచ్చినప్పుడు 'కేమెరాలు ఫ్లాష్ అవుతాయి. ఆకలి గొన్న యాత్రికులకు హాట్ డాగ్ ఇచ్చినట్టుగా వారి నోళ్ళముందు మైక్రోఫోన్లు ప్రత్యక్ష్యమౌతాయి.' నౌకర్లందరూ నేరం జరిగిందో, లేదో తెలుసుకోకుండానే ఫోటోలకోసం నిలుచుంటారు. పోలీసులు వచ్చి లైబ్రరీ తలుపు పగలగొట్టిన తరువాత– బ్యారన్ భార్యని కాల్చివేశాడనీ, సెక్రెటరీ ఆత్మహత్య చేసుకున్నాడనీ తెలుస్తుంది. నౌకర్ల స్టేట్‌మెంట్లు తీసుకుని కొత్త బ్యారొనెస్ ఇలీయాస్ అనీ రాసుకుని వారు నిష్క్రమిస్తారు. నవలికలో పోలీసుల పాత్ర మూడు పేజీలు కూడా ఉండదు.

★★★

సంభవించబోయే మరణాల గురించి నౌకర్లకు తెలిసున్నప్పటికీ ఒక్కరూ అడ్డుకోడానికి ప్రయత్నించరన్న సంగతిని రచయిత్రి ఎగతాళి, నిందాస్తుతి ఉపయోగించి చెప్తారు. తమ ఆజ్ఞలకింకా విలువుందని అనుకునే యజమానుల వ్యక్తిగత దురవస్థను పరిచారకులు బాహాటంగా బహిర్గతపరచడం వంటి కపటమైన సంబంధాలని చూపిస్తారు రచయిత్రి. వచనం చమత్కారమైన సంభాషణలతో సరదాగా సాగుతుంది. కథ చోద్యమైనదీ, భయానకమైనదీ అయినప్పటికీ సంచలనాత్మక వినోదం కలిగిస్తుంది. ఏ ఉపోద్ఘాతమూ లేని కథనంలో ఎవరు ఎవరితో ఏమిటి చెప్తున్నారో ఒక పట్టాన అర్థం కాదు.

COMMENTS